కాజీపేట ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారుల డబ్బాలను తొలగిస్తున్న గ్రేటర్ అధికారులు

చిరు వ్యాపారులకు శాపంగా
సుందరీమణుల పర్యటన

- రహదారుల వెంట డబ్బాలు, షెడ్ల తొలగింపు

వరంగల్, మే 13 : ప్రపంచ సుందరీమణుల నగర పర్యటన చిరు వ్యాపారులకు శాపంగా మారింది. బుధవారం వారు నగరానికి వస్తున్న నేపథ్యంలో గ్రేటర్ కార్పొరేషన్ అధికారులు రెండు రోజులుగా మడికొండ నుంచి కాజీపేట, ఫాతిమా బ్రిడ్జి, ఎన్ఐటీ, హనుమకొండ చౌరాస్తా, ఎంజీఎం, కాశీబుగ్గ రహదారుల వెంట ఉన్న చిరు వ్యాపారాలు, డబ్బాలు, షాపుల ముందు ఏర్పాటు చేసుకున్న షెడ్లతో పాటు సైన్ బోర్డులను సైతం తొలగించారు. దీంతో రెక్కాడితే డొక్కాడని చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఒక్క రోజు సుందరీమణుల పర్యటన కోసం తమ పొట్ట కొట్టడంపై మండిపడుతున్నారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దడమంటే చిరు వ్యాపారాలు తొలగించడమా? అని ప్రశ్నిస్తున్నారు. ఏసీ బస్సులో ప్రయాణించే సుందరీమణుల కోసం ఫుట్‌పాత్‌లపై జీవన పోరాటం చేస్తున్న పేద బతుకులను చిదిమేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చైర్మన్ తిరుమల్‌రావును సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాలిటెక్నిక్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఎస్వీఎస్ కళాశాల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి, మే 13 : పాలిటెక్నిక్ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్వీఎస్ కళాశాల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు సూచించారు. భీమారంలోని ఎస్వీఎస్ కళాశాల కన్వెన్షన్ హాల్‌లో పాలీసెట్ పరీక్ష రాసిన, పాలిసెట్ ద్వారా డిప్లొమాలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ చదివిన వారికి డీఆర్డీవో, బీహెచ్ఈఎల్, రైల్వే, మెట్రో వంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. పాలిటెక్నిక్‌లో మెకానిక్, సివిల్, ఈసీఈ, సీఎస్ఈ, ఫార్మసీ వంటి టెక్నాలజీ కోర్సులు ఉంటాయన్నారు. సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, పాలిటెక్నిక్ అడ్మిషన్ ప్రొఫెసర్ ఈవీ రావు, ప్రిన్సిపాల్ రమేశ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్ తిరుమల్ రావును సన్మానించారు.

పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్, మే 13 : గ్రేటర్‌లో చేపట్టిన నాలాల పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం పలు డివిజన్లలో కొనసాగుతున్న పూడితతీత పనులను పరిశీలించారు. పోచమ్మ జంక్షన్‌ను సుందరీకరించాలని సూచించారు. దేశాయిపేట ప్రాంతంలో నీటి లీకేజీని పరిశీలించిన ఆమె వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. కొబ్బరి బోండాలను డ్రైనేజీల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కావేటి కవిత, బస్వరాజు కుమారస్వామి, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి, టీపీఎస్ అనిల్ పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, మే 13 : కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ రెండో, నాలుగో, ఆరో (రెగ్యులర్) సెమిస్టర్ పరీక్షలు, ఒకటో, మూడో, ఐదో (బ్యాక్‌లాగ్) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, తిరుమలాదేవి, వెంకటయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ఎడ్‌సెట్ గడువు 20 వరకు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, మే 13 : టీజీ ఎడ్‌సెట్-2025 ప్రవేశ పరీక్ష రిజిస్ట్రేషన్, సబ్మిషన్ (ఆన్‌లైన్) గడువును ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ వెంకట్‌రామ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించామని గమనించాలని కోరారు.

నేడు నగరానికి 'అందాల' పోటీదారులు

- కలెక్టర్ల ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు
- వెయ్యి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్ సందర్శన
- భద్రతా ఏర్పాట్లపై సీపీ సమీక్ష

వెయ్యి స్తంభాల ఆలయాన్ని పరిశీలిస్తున్న గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ తానాజీ వాకడే, మేయర్ సుధారాణి

హనుమకొండ, మే 13 : అందాల పోటీల అభ్యర్థులు బుధవారం వరంగల్‌లో పర్యటించనున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదతో పాటు వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో సుందరీమణుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వరంగల్ నగర వారసత్వం, సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది.

నగరంలో పర్యటన వివరాలు..

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ప్రపంచ సుందరీమణులు హైదరాబాద్ నుంచి బయలుదేరి సాయంత్రం 4:35 గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 5:45 గంటలకు వెయ్యి స్తంభాల ఆలయానికి చేరుకుని అక్కడి కార్యక్రమాల అనంతరం 6:25కు బయలుదేరి 6:40 గంటలకు వరంగల్ ఫోర్ట్‌కు చేరుకొంటారు. అనంతరం 7:35 గంటలకు బయలుదేరి రాత్రి 7:55 గంటలకు హరిత కాకతీయ హోటల్‌కు చేరుకొంటారు. రాత్రి 8 నుంచి 9గంటల వరకు పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన డిన్నర్ అనంతరం రాత్రి 9 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు. డిన్నర్‌లో గ్రిల్డ్ చికెన్, ఫిష్ బైట్, వెజ్ పన్నీర్ తదితర వంటకాలు వడ్డించనున్నారు.

సుందరీమణుల పర్యటనకు పోలీస్ బందోబస్తు..

సుబేదారి/హనుమకొండ చౌరస్తా : సుందరీమణుల బందోబస్తు ఏర్పాట్లపై మంగళవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో సీపీ సమావేశం నిర్వహించారు. వెయ్యి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, హరిత హోటల్ వద్ద, వారు ప్రయాణించే మార్గాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముగ్గురు డీసీపీలు, 11మంది ఏసీపీలు, 32మంది ఇన్‌స్పెక్టర్లు, 81మంది ఎస్సైలు, 155మంది ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు 325 మంది, మహిళా సిబ్బంది 106, హోంగార్డ్స్ 210మంది పాల్గొంటారని తెలిపారు. సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా పాల్గొన్నారు. అలాగే హరిత హోటల్ వద్ద సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు పహారా కాస్తున్నారు. వెయ్యిస్తంభాల ఆలయ పరిసర ప్రాంతాల నివాసాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. గుడి చుట్టుపక్కల ఇళ్లల్లో ఉన్న వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్ పాల్గొన్నారు. అలాగే వెయ్యి స్తంభాల ఆలయాన్ని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సందర్శించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఉన్నారు. ప్రపంచ అందాల భామల పర్యటన నేపథ్యంలో నగర ప్రధాన రహదారుల కూడళ్లు రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో జిగేల్‌మంటున్నాయి. వెయ్యి స్తంభాల ఆలయంతో పాటు ఖిలా వరంగల్‌లోని కీర్తి తోరణాలను అందంగా ముస్తాబు చేశారు.

సుబేదారి : మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

కాజీపేట, మే 13 : కాజీపేట పట్టణం 62వ డివిజన్ పరిధిలోని సోమిడి ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల జనరల్ ఫండ్‌తో డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. డివిజన్‌లో ఇప్పటికే పనులన్నీ పూర్తి దశకు చేరుకున్నాయన్నారు.

పంటలపై రైతులకు అవగాహన సదస్సు

ఎల్కతుర్తి, మే 13 : వచ్చే ఖరీఫ్ సీజన్‌లో అవలంబించాల్సిన పద్ధతులను మండలంలోని వల్భాపూర్‌లో నిర్వహించిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వరంగల్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీజన్, హేమశరత్‌చంద్ర రైతులకు అధిక యూరియా వాడకం నివారించడం, నీటి ఆదా పద్ధతులు, వ్యవసాయ ఇన్‌పుట్‌ల బిల్లుల జాగ్రత్త, పురుగు మందుల పిచికారీ, భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువుల వాడకం, బీటీ విత్తన పరీక్ష, పంట మార్పిడిపై వివరించారు. కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, ఏఈవో అంజలి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ చైతన్యరెడ్డి, నెహ్రూ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్

కమలాపూర్, మే 13 : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ హెచ్చరించారు. మంగళవారం కమలాపూర్ రైతు వేదికలో ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన, ఎరువులు, పురుగు మందుల నిల్వలు ప్రతి నెల మొదటి వారంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వ్యాపారులు నకిలీ ఎరువులు, విత్తనాలు తీసుకువచ్చి రాత్రి వేళల్లో అమ్మితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజ్‌కుమార్, ఏవో రాజ్‌కుమార్, వ్యవసాయ సాంకేతిక అధికారి కమలాకర్, డీలర్లు నూక సాంబమూర్తి, సాంబశివుడు, గట్టు నారాయణ, రాజిరెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

దామెర, మే 13 : దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలిక (16)కు మాయ మాటలు చెప్పి లోబర్చుకున్న యువకుడిని అరెస్టు చేసినట్లు పరకాల ఏసీపీ సతీశ్ బాబు మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బాలికను ఇదే మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన చుంచు సిద్ధార్థ్ లైంగిక సంబంధం పెట్టుకోగా, బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి పరకాల కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కొంక అశోక్ పాల్గొన్నారు.

కోమటిపల్లి శివారులో మృతదేహం గుర్తింపు

నయీంనగర్, మే 13 : కేయూ పోలీసుస్టేషన్ పరిధిలోని కోమటిపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, బూడిద రంగు ఫుల్ హ్యాండ్ టీషర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించాడని, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712685115 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నూతన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

హనుమకొండ చౌరస్తా, మే 13 : నూతన పద్ధతులపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని డీఈవో వాసంతి అన్నారు. జిల్లాలో మొదటి దశకు చెందిన ఉపాధ్యాయుల శిక్షణ మంగళవారం భీమారంలోని స్కిల్ స్టార్క్ పాఠశాలలో ప్రారంభమైంది. ప్రస్తుతం విద్యార్థుల ఐక్యూ లెవెల్స్ పెరిగినందున వాటిని గమనించి ఉపాధ్యాయులు తమ సబ్జెక్టును మెరుగుపరుచుకోవాలన్నారు. మొత్తం 506 మంది ఉపాధ్యాయులు మొదటి దశ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ అబ్దుల్ హై, గుణాత్మక విద్య సమన్వయకుడు శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా సాగుదాం

హనుమకొండ చౌరస్తా, మే 13 : రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలని వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చాయి. మంగళవారం ములుగురోడ్ సెంటర్‌లోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మౌలానా ఫసియొద్దీన్ ఖాస్మీ అధ్యక్షతన 'వక్ఫ్ బచావో-దస్తూర్ బచావో' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వరంగల్ ఇస్లామియా కాలేజీ గ్రౌండ్‌లో 18న జరిగే బహిరంగ సభ విజయవంతానికి తమవంతు సహకారం అందించాలని పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు కోరారు. సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, మొగిలి, బోడ డిన్నా, జోరిక రమేశ్, డాక్టర్ రాజ్‌మహ్మద్, రాంబ్రహ్మం, నున్నా అప్పారావు పాల్గొన్నారు.

15, 16న ఉమ్మడి జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక

హనుమకొండ చౌరస్తా, మే 13 : ఉమ్మడి జిల్లాలోని 6 జిల్లాల జట్లకు ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ పోటీలను ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొననున్న 6 జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 15, 16వ తేదీల్లో కరుణాపురంలోని వంగపల్లి క్రికెట్ క్రీడా మైదానంలో నిర్వహిస్తామన్నారు. అండర్-25 విభాగంలో వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మహబూబాద్, జనగామ, ములుగు జిల్లా జట్లను ఎంపిక చేస్తామని, 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు ఉన్న క్రీడాకారులు అర్హులని చెప్పారు. ఆధార్‌కార్డు, మీ సేవ జారీ చేసిన డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపికైన 6 జిల్లా జట్లు వరంగల్ జిల్లాలోని మొగిలిచర్ల, హనుమకొండ జిల్లాలోని రెడ్డిపురం, జనగామ జిల్లాలోని వంగపల్లి క్రికెట్ క్రీడా మైదానాల్లో ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ పోటీల్లో పాల్గొంటాయని, ఇందులో క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. జూన్ మొదటి వారం నుంచి హైదరాబాద్‌లో జరిగే క్రికెట్ లీగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పాల్గొంటుందని శ్రీనివాస్ తెలిపారు.

20న జరిగే దేశ వ్యాప్త కార్మిక సమ్మెకు మద్దతు

హనుమకొండ చౌరస్తా, మే 13 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలని అఖిల భారత సాంకేతిక విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, కేయూ అధ్యక్షుడు ఉల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూలోని సంఘ కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు ఈ నెల 20న ఐక్యంగా నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ప్రకటించారు. తమ సంఘం నేతృత్వంలో కేయూ పరిపాలనా భవనం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కుల ఉల్లంఘనలను నిరసిస్తూ చేపడుతున్న సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

నిట్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభం

మాట్లాడుతున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, మే 13 : నిట్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. రెండు నెలల క్రితం దేశవ్యాప్తంగా ఉన్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా, 219 మంది ఈ ప్రెస్టీజియస్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. జూలై 9, 2025 వరకు ఎన్ఐటీలోని వివిధ విభాగాలల్లో పరిశోధనల్లో పాల్గొంటారు. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో పురోగమిస్తున్న ప్రాజెక్టులపై ప్రముఖ అధ్యాపకుల మార్గనిర్దేశంలో పని చేస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ విద్యార్థుల పరిశోధనా ప్రయాణానికి ఒక గొప్ప ప్రారంభమని, ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి సూచించారు. డీన్ (అకాడమిక్స్) శరత్‌బాబు విద్యార్థులకు నిట్ పరిశోధనా వాతావరణంపై వివరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

వరంగల్‌చౌరస్తా, మే 13 : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. వరంగల్‌లోని జిల్లా కార్యాలయంలో మంగళవారం వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలోని ఐసీటీసీ, పీపీటీసీ, ఏఆర్‌టీ, డీఎస్ఆర్‌సీ, ఎన్‌జీవోస్ సంస్థల ద్వారా గుర్తించిన కేసుల వివరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. సమాజంలో అవగాహన పెంచడం వల్లే హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నివారించడం సాధ్యం అవుతున్నదని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతోపాటు బాధితులకు ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా వైద్య సేవలు నిరాటంకంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆచార్య, హనుమకొండ జిల్లా డీటీసీవో డాక్టర్ హిమబిందు, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాకటర్ సూర్య ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురి, సూపర్‌వైజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో మిస్సింగ్.. కాజీపేటలో గుర్తింపు

కుటుంబ సభ్యులకు మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

కాజీపేట, మే 13 : బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ అదృశ్యమై కాజీపేట రైల్వేస్టేషన్‌లో కనిపించగా, జీఆర్పీ సిబ్బంది చేరదీసి మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై సోమవారం ఓ మహిళ అనుమానంగా కనిపించగా, జీఆర్పీ సిబ్బంది ఆమెను జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. ఆ మహిళకు మతిస్థిమితం సరిగాలేదని గమనించి వివరాలు తెలుసుకొనేందుకు ప్రయత్నించారు. ఇటీవల బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో దుర్గం సౌజన్య (26) అదృశ్యమైన కేసు వివరాలు తెలుసుకొని అక్కడి ఎస్సై రాకేశ్‌కు సమాచారం అందించామన్నారు. దీంతో ఆయన ఆ మహిళ బెల్లంపల్లిలో అదృశ్యమైన సౌజన్యగా గుర్తించి ఆమె సోదరుడు అజయ్, కుటుంబ సభ్యులను కాజీపేట జీఆర్పీ స్టేషన్‌కు పంపించారు. దీంతో కుటుంబసభ్యులకు సౌజన్యకు అప్పగించామని సీఐ వివరించారు.

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

హనుమకొండ, మే 13 : హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతంలోని జ్యోతి బసు నగర్ ఫేస్ -1, 2, రెండో డివిజన్ భగత్‌సింగ్ నగర్ కాలనీల్లో 20 సంవత్సరాలకు పైగా నివాసముంటున్న పేదలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ ఇన్‌చార్జి తహసీల్దార్ రంజిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలు 20 సంవత్సరాల క్రితం జ్యోతి బసు నగర్ ఫేస్ -1,2, భగత్ సింగ్ నగర్‌లో గుడిసెలు వేసుకొని నివాసముంటూ కరెంటు మీటర్లు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇంటి నంబరు, నల్లా కనెక్షన్ ఉండి పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ నార్త్ ఏరియా కార్యదర్శి గాదె రమేశ్, నాయకులు ఇంజపల్లి రాజు, మంద మల్లేశం, బొట్ల కుమారస్వామి, ఒంటెల పాపయ్య, రాజు, అమృత, కళావతి, స్వప్న పాల్గొన్నారు.

డెయిరీ ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

భీమదేవరపల్లి, మే 13 : పరకాల నియోజకవర్గంలోని దామెరలో మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు మహిళా డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ముల్కనూరు మహిళా సొసైటీలో పరకాల నియోజకవర్గంలోని మహిళా రైతుల శిక్షణ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద హాజరయ్యారు. ముల్కనూర్ సొసైటీ ద్వారా పాడి రంగంలో మహిళలు ఏ విధంగా పురోభివృద్ధి సాధిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 6 మండలాల్లోని మహిళా రైతులతో డెయిరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 53 కో ఆపరేటివ్ సంఘాలను రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల గ్రామీణాభివృద్ధి అధికారులు మేన శ్రీను, కౌసల్యాదేవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్

హనుమకొండ చౌరస్తా, మే 13 : పాలిసెట్ - 2025 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కో ఆర్డినేటర్ బైరి ప్రభాకర్ తెలిపారు. జిల్లాలోని 12 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 6,424 మందికి 5,941 మంది హాజరైనట్లు చెప్పారు. అబ్బాయిలో 3,476 మందికి 3,218 మంది హాజరు కాగా, అమ్మాయిల్లో 2,948 మందికి 2,723 మంది హాజరయ్యారన్నారు. మొత్తం హాజరు శాతం 92.48 నమోదైందన్నారు. ఈ పరీక్షను పర్యవేక్షించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి (ఎస్‌బీటీఈటీ) తరపున గుగులోత్ రాములును నియమించారు. హనుమకొండ జిల్లాలో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు మనోజ్‌కుమార్ (కాజీపేట,ఎంఈవో), స్పెషల్ స్క్వాడ్ సభ్యురాలిగా సంగీత, నాయబ్ తహసీల్దార్, ఎస్సై సదానందం బాధ్యతలు నిర్వర్తించారు. పరీక్ష విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా అధికారులు, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, డీఈవో కార్యాలయం, టీఎస్ ఎన్పీడీసీఎల్, ఆర్టీసీ, డీఎంహెచ్‌వో, జీడబ్ల్యూఎంసీ, ఇతర కమిటీలు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వెంకన్నకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

పరకాల మే 13 : ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో జరుగనున్న సరస్వతీ పుష్కరాలకు పరకాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రవిచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరకాల నుంచి కాళేశ్వరం వరకు ప్రతి రోజూ 10 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. పెద్దలకు రూ.190, పిల్లలకు రూ.110గా టికెట్ ధరను నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9705479088, 7382926774 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, మే 13 : కాజీపేట రైల్వే జంక్షన్ శివారులోని వడ్డేపల్లి చెరువు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ సీఐ నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి చెరువు రైల్వే పంప్ హౌస్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే అధికారుల నుంచి సమాచారం వచ్చిందన్నారు. మృతుడి వయసు దాదాపు 45 ఏళ్లు ఉంటుందని, ఒంటి పై వంకాయ రంగు టీ షర్టు, వంకాయ రంగు షార్ట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఎవరైనా సంబంధీకులుంటే కాజీపేట జీఆర్పీ స్టేషన